క్లుప్తంగా

కొత్త ఓటర్ల పేర్లు నమోదు చేయండి



గండేడ్: ఓటర్ల జాబితాలో అర్హులైన వారి పేర్లు చేర్చాలని తహసీల్దార్ జ్యోతి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు లిస్టులో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే వాటిని బీఎల్ఓలు సరిచేయాలన్నారు. ఓటర్ల జాబితా కోసం రూపొందించిన బీఎల్ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అందులో ఓటర్ల జాబితాను పరిశీలించాలని, అందులో చనిపోయిన వారు ఎవరైనా ఉంటే తొలగించాలని సూచించారు. పకడ్బందీగా జాబితాను రూపొందించాలని తెలిపారు.

ఇసుక నిల్వల పరిశీలన

అడ్డాకుల: మండలంలోని వర్నె శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను బుధవారం మైనింగ్ శాఖ అధికారి భరణి పరిశీలించారు. స్థానిక వాగు నుంచి అనుమతి లేకుండా రాత్రి వేళ టిప్పర్ల ద్వారా ఇసుకను తరలించి పొలంలో నిల్వ చేశారు. రెవెన్యూ అధికారులు ఇసుకను సీజ్ చేసి మైనింగ్ అధికారులకు సమాచారమివ్వడంతో గిర్దావర్ ఇషాన్ సాహత్‌తో కలిసి ఆమె పొలంలో నిల్వ చేసిన ఇసుక నాణ్యతను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన నమూనాలను సేకరించారు. ఇదిలా ఉండగా, మైనింగ్ అధికారుల నివేదిక అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కిషన్ తెలిపారు. అంత వరకు ఇసుకను తమ స్వాధీనంలోనే ఉంచుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాగా, అనుమతి లేకుండా వాగులో ఇసుకను తవ్వి పొలానికి తరలించుకున్న వ్యక్తిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది తేలలేదు.

టీఎన్‌జీఓస్ డైరీ ఆవిష్కరణ



రాజాపూర్: టీఎన్‌జీఓస్ డైరీని బుధవారం తహసీల్దార్ రాంబాయి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీఓ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఖదీర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డితో చర్చించి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బాలానగర్ యూనిట్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ భరత్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్‌నాయక్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



మిడ్జిల్: మండలంలోని చిల్వేర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వార్షికోత్సవం నిర్వహించారు. చిన్నారులకు వివిధ రకాల బహుమతులను అందజేశారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అడ్డా కల్పించండి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని భీమయ్య హోటల్ వద్ద నిల్చునే కూలీలకు అడ్డా చూయించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ మున్సిపల్ ఆర్ఓ శశిధర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అడ్డా కూలీలు అక్కడ జమ కావడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. వారికి ఓ అడ్డా చూయించి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. తాగునీరు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. అలాగే రూ.5కే భోజనం పెట్టించాలన్నారు. వేసవి అయినందునా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సేన నాయకుడు శేఖర్, కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురభి రఘు, నాయకులు శ్రీను, గోపాల్, చంద్రమౌళి పాల్గొన్నారు.

మూసాపేటలో బైక్ చోరీ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో మంగళవారం రాత్రి గ్లామర్ బైక్ చోరీకి గురైంది. బాధితుడి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాంద్‌పాష టీఎస్ 06 ఈహెచ్ 3795 నంబరు గల గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని రాత్రి తన ఇంటి వద్ద నిలిపాడు. కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగా మధ్యరాత్రి గుర్తు తెలియని దుండగులు బైక్‌ను చోరీ చేశారు. హ్యాండిల్ లాక్‌ను విరగొట్టి బైక్‌ను దొంగిలించారు. బుధవారం ఉదయం ఇంటి వద్ద బైక్ కనిపించకపోవడంతో అంతటా వెతికారు. తర్వాత స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, అదే కాలనీలో ఒక చోట ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీని కూడా బాధితులు పరిశీలించారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. కాగా కొన్నాళ్ల నుంచి మూసాపేటలో బైక్ చోరీలు ఎక్కువయ్యాయి. ఇళ్ల వద్ద నిలిపే బైక్‌లు చోరీకి గురవుతున్నాయి. దీనివల్ల రాత్రివేళ బైక్‌లు, ఆటోలను బయట నిలపడానికి జంకుతున్నారు. ఇదిలా ఉండగా, గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో బైక్‌లను చోరీ చేస్తున్న దొంగలను గుర్తించడం పోలీసులకు సవాలుగా మారింది.



మురుగును తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



బీకేరెడ్డికాలనీలో పారుతున్న మురుగు



రామయ్యబౌలి వద్ద రోడ్డుపై చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికులు

లోతట్టు ప్రాంతాలు మురుగుమయం



చిత్తడి చిత్తడిగా మారిన గోల్ మసీదులోని వీధులు



మర్లులోని ఎస్ఆర్‌నగర్ వద్ద బీటీ రోడ్డుపై పారుతున్న మురుగు, పేరుకుపోయిన చెత్తాచెదారం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి ఓపెన్ నాలాలు నిండి పొంగి పొర్లాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపైకి మురుగు చేరి పేరుకు పోయింది. ముఖ్యంగా బీకేరెడ్డికాలనీ, మర్లు, రామయ్యబౌలి తదితర ప్రాంతాల్లో ఏరులై పారింది. చాలా చోట్ల రోడ్లన్నీ బురదతో చిత్తడి చిత్తడిగా మారాయి. దీంతో పాదచారులు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరకు బుధవారం ఉదయం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆయా చోట్ల మురుగును తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కోయిలకొండలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శశికళ



భూత్పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కోయిల్‌కొండ: రైతులు సాగుచేసిన వరిపంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శశికళ అన్నారు. బుధవారం మండలంలోని గార్లపహాడ్, మల్కాపూర్, వీరంపల్లి, కోయిల్‌కొండ, అంకిళ్ల, చందాపూర్, ఎల్లారెడ్డిపల్లి, వింజామూర్ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులు బయట దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, నాయకులు భీంరెడ్డి పాల్గొన్నారు.

భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం వరి కొనుగోలు కేంద్రాలను మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి ప్రారంభించారు. మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మద్దిగట్ల, ఎల్కిచర్ల, కర్వెన, కొత్తమొల్గర, పాతమొల్గర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, విండో చైర్మన్ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ చెన్నకిష్టన్న, ఏఈఓ మురళీధర్, ఏఈఓ హర్షవర్ధన్, లక్ష్మి, శంకర్ పాల్గొన్నారు.

మిడ్జిల్: మండలంలోని వెలుగోమ్ములలో సింగిల్ విండో ద్వారా కొనుగోలు చేసే వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యాన్ని అమ్ముకొని లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సువర్ణ, బాలు, మన్నెం, రాము, లక్ష్మారెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు



దేవరకద్ర రూరల్: కౌకుంట్లలోని గ్రామ దేవతల వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శీతలాదేవి, బొడ్రాయి, కోటమైసమ్మ, పెద్దమ్మ, కట్టమైసమ్మ దేవతలు ప్రతిష్ఠాపన వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన సమ్మె బుధవారం 10వ రోజుకు చేరుకుంది. సమస్యల పరిష్కారానికి చొరవ చూపని ప్రభుత్వ తీరును నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో చీపుర్లతో రోడ్లను ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వీఓఏలకు వేతనాలను పెంచాలని, గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు తిరుపతమ్మ, రమాదేవి, వసియాబేగం, సరిత, స్వరూప, కల్పన, సుజాత, చంద్రకళ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

దేవరకద్ర: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే బాధ్యత వహిస్తూ రైతుకు నష్టం జరగకుండా మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం దేవరకద్ర మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. సకాలంలో ధాన్యం కొనకపోవడం వల్లనే ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్దయి కొంత నీటిలో కొట్టుకుపోవడానికి కారణమైందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు సంబురాల్లో మునిగి తేలుతేలుతున్నారని, రైతుల గోడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మిల్లు కేటాయించకుండా కొనుగోలు కేంద్రం ఎలా ప్రారంభించారని ప్రశ్నించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని అన్నారు. ఈ విషయమై కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్, తహసీల్దార్‌తో ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.



మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

రోడ్డు పనులు ప్రారంభం

అడ్డాకుల: మూసాపేట మండలంలోని చక్రాపూర్ బీటీరోడ్డు రెన్యూవల్ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారి నుంచి చక్రాపూర్ మీదుగా దేవరకద్ర మండలంలోని లక్ష్మిపల్లి వరకు 7.20 కిలోమీటర్ల దూరం బీటీరోడ్డు రెన్యూవల్‌కు ఎంఆర్ఆర్ ద్వారా రూ.2.45కోట్లు మంజూరయ్యాయి. దీంతో ఈనెల 2న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్ పనులను మొదలు పెట్టగా, పంచాయతీరాజ్ ఏఈ లక్ష్మణ్‌గౌడ్ పర్యవేక్షించారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంపై సర్పంచ్ శైలజా ప్రకాష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే చక్రాపూర్, స్ఫూర్తితండా, కనకాపూర్ తండా వాసులకు రోడ్డు కష్టాలు తీరనున్నట్లు తెలిపారు.

పనిచేసే వారిని ఆదరించండి



నవాబుపేట మార్కెట్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

- ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: పనిచేసే వారికి పట్టం కడితే అభివృద్ధి మరింత సాధ్యమవుతుందని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటైన అనతి కాలంలోనే సీఎం కేసీఆర్ దృఢసంకల్పంతో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసినట్లు తెలిపారు. ఓట్ల రాజకీయాలకు స్వస్తి పలికి నిరంతరం ప్రజల మధ్య తిరిగే నాయకులను తయారు చేసి ప్రజల చెంత ఉంచారని వివరించారు. ప్రజల మేలు కోరే వారికి పట్టం కట్టాలని, కేవలం మాటలు చెప్పే వారిని నమ్మి మోసపోవద్దని కోరారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలు పట్టని నాయకులు కుంటి సాకులు చెబుతూ పనిచేసే ప్రభుత్వంపై విమర్శలు చేడమే పనిగా పెట్టుకోవడం విచారకరమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వివిధ రంగాల్లో అవార్డులు అందించడమే అందుకు నిదర్శనమని తెలిపారు. మీకు మంచి చేస్తారన్న నమ్మకం కలిగిన వారికే ఓటు వేయాలని కోరారు.

అభివృద్ధి పనుల ప్రారంభం..

మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో రూ.25లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. 10 మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందించారు. మండల కేంద్రంలో శ్మశానవాటికను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, రైతుబంధు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ చందర్‌నాయక్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమిపూజ..

బాలానగర్: మండలంలోని తిరుమలగిరి గ్రామం గోరిగడ్డ తండాలో బుధవారం సంత్ సేవాలాల్ మహరాజ్, మేరమ్మ యాడి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. సేవాలాల్ మహరాజ్, మేరమ్మ ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, వైస్ ఎంపీపీ వెంకటచారి, ఏఎంసీ చైర్మన్ రజిని, నాయకులు తిరుపతి, జగన్ నాయక్, వెంకట్రాం నాయక్, బాలునాయక్, కర్ణం శ్రీను పాల్గొన్నారు.

బొడ్రాయి పండుగ..

మండలంలోని సూరారంలో బుధవారం నిర్వహించిన బొడ్రాయి పండుగలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంపీ, ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామానికి ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న దుందుభీ నదిపై బ్రిడ్జితో పాటు ఉడిత్యాల గ్రామం వరకు బీటీ రోడ్డు ఏర్పాటునకు కృషి చేయడంతో పాటు పనులు ప్రారంభించిడం హర్షనీయమని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పందయ్య, లింగం, రాజు, యాదయ్య పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం



దేవరకద్ర మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్, ఎంపీపీ

దేవరకద్ర: రైతులు అధైర్యపడవద్దని, చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని మార్కెట్ చైర్మన్ విజయ, ఎంపీపీ రమాదేవి, సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం దేవరకద్ర మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని వారు పరిశీలించారు. రైతులకు నష్టం జరగకుండా చూస్తామని, తడిసిన ధాన్యం కూడా మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని తెలిపారు. అలాగే నష్టపోయిన రైతులను ఆదుకుంటామని పేర్కొన్నారు. ప్రతిపక్షాల నేతలు గగ్గోలు పెడుతున్నారని, రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ తవ్వకాలు నిలిపివేయాలి

కోయిల్‌కొండ: మండలంలోని రాజునాయక్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలోని 130 సర్వేనంబర్‌లో మైనింగ్ తవ్వకాలను నిలిపివేయాలని బుధవారం గ్రామస్తులు తహసీల్దార్ ప్రేమ్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి అధికారులను నమ్మించి మైనింగ్ తవ్వకాన్ని చేస్తున్నారన్నారని ఆరోపించారు. దీని ద్వారా ఆ ప్రాంతమంతా వన్యప్రాణులు కనిపించకుండా కనుమరుగయ్యాయని తెలిపారు. అంతేకాక రైతులు పొలాల్లో వేసుకున్న 200పైగా బోర్లు డ్రై అయ్యాయన్నారు. వెంటనే మైనింగ్ తవ్వకాలను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో రాము నాయక్, చంద్రశేఖర్, వెంకటయ్య, శ్రీరాంనాయక్, రాజునాయక్, హనుమంతు, లిమానాయక్, బాబు, భీముడు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఆదిత్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో బుధవారం విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్‌పై ఉపాధ్యాయులతో అవగాహన కల్పించారు. అనంతరం ఐదు నుంచి పదో తరగతి వరకు చదివే వంద మంది విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ చాటిన వారికి జిల్లా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్య సంఘం అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్ మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29 నుంచి జూన్ 14వ తేదీ వరకు కోచింగ్ సెంటర్‌లో సమ్మర్ క్యాంప్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో క్యాంప్ డైరెక్టర్ రవికుమార్, సంఘం సభ్యులు నరేందర్, శివకుమార్, రాజశేఖర్, బాలరాజు, రాములు నాయక్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతన్నకు నష్టం



కందూర్ వద్ద తడిసిన ధాన్యాన్ని తొలగిస్తున్న మహిళలు



గండేడ్ మండలం రెడ్డిపల్లిలో తడిసిన ధాన్యాన్ని అరబెడుతున్న సత్యమ్మ



నవాబుపేట మండలం రుద్రారంలో నేలరాలిన వరిధాన్యం

అకాల వర్షాలతో రైతన్నకు తీరని నష్టం ఏర్పడింది. అకస్మాత్తుగా వస్తున్న ఈదురుగాలులు, వర్షాలతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. చేతికొచ్చిన వరిపంట కళ్లముందే తడిసి ముద్దవుతుండడంతో రైతన్న కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. ఇప్పటికే కొందరు రైతులు పంట కోసి ఆరబెడుతుండగా, మరికొన్ని చోట్ల పంట చేతికొచ్చే సమయంలో నేలపాలవుతోంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటి పాలవుతుండడంతో ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

➡ అడ్డాకుల, మూసాపేట మండలాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వరి ధాన్యం తడిసిపోయింది. కోతలు పూర్తి చేసి ఆరబెట్టిన ధాన్యం వర్షాలకు తడిసింది. సర్వీస్ రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని బుధవారం రైతులు కూలీలను ఏర్పాటు చేసుకుని ఆరబెట్టుకునే పరిస్థితి నెలకొంది. మూసాపేట మండలంలో సుమారు 60ఎకరాల వరకు వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

➡ నవాబుపేట మండలంలో అకాల వర్షంతో దాదాపుగా 37ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. 24ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి.

➡ గండేడ్ మండలం రెడ్డిపల్లికి చెందిన సత్యమ్మ ఎకరా వరి సాగు చేసింది. మూడు రోజుల కిందట పంట కోసి ఒక్కరోజు ఆరబెట్టారు. రాత్రికి గాలివాన రావడంతో ధాన్యంపై కప్పిన కవర్లు ఎగిరిపోయి ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఇలా అనేక మంది రైతులు మండలంలో అకాల వర్షాలతో నష్టపోవాల్సి వచ్చింది.



కొత్తూర్‌లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి సిద్ధార్థ

➡ మిడ్జిల్ మండలంలో అకాల వర్షానికి మిడ్జిల్, కొత్తూర్ గ్రామాల్లో దాదాపు 30 ఎకరాల్లో పంట నష్టం కలిగినట్లు మండల వ్యవసాయ అధికారి సిద్ధార్థ తెలిపారు. మండలంలో 78.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

పంట చేతికొచ్చే దశలో నష్టం..

వరి పంట కోత దశకు వచ్చిన దశలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వడ్లు రాలిపోయాయి. ఆరుకాలం కష్టపడి సాగు చేసిన వరి పంట చివరకు నష్టం మిగిల్చింది. పెట్టుబడులు కూడా చేతికి వచ్చేది కష్టంగా ఉంది.

– మాల కృష్ణయ్య, రైతు, గుడిగానిపల్లి



ధాన్యం నేల పాలైంది..

చేతికి వచ్చిన పంట అకాల వర్షం వల్ల నేల పాలైంది. దాదాపుగా 4ఎకరాల వరి పంట మొత్తం రాలిపోయింది. ఎకరానికి రూ.25 నుంచి రూ.30వేలు ఖర్చు చేశాం. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు నీటిపాలు చేశాయి. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– శ్రీనివాస్, నవాబుపేట

